


# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 950 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -21-

*"జీవితం ఒక నియమబద్ధమైన కళగా కాక, అవసరబద్ధమైన పాలసీ కింద తయారయ్యింది. తన దేహమూ, మనస్సు కాక, అంత కన్నా అధికం ఏమీ కాదు. అనే నమ్మకం వల్ల, తన స్వతంత్రాన్ని మానవుడు కొందరు తెలివిగల వాళ్ళ చేతుల్లో పెట్టి, "తనకి పుష్కలంగా తిండి పెట్టి, సినిమాలు చూపిస్తే" చాలు అన్నాడు. కళ అనేది ఆత్మ తన ఔన్నత్యానికే తపించే సాధనంగా కాక, ప్రజల ఆహ్లాదానికైన వినోదం అయిపోయింది. జీవితం మీదా, సంపాదన మీదా, డబ్బు ప్రభావాన్ని తగ్గించుకోవాలి. అంటే, చాలా విప్లవాలు తెచ్చుకోవాలి జీవితంలో. అపవాదులు పడాలి. ఇతరులకు చాలా లోకువ కావాలి. డబ్బుల్లేని వాడు బానిసత్వాన్ని తప్పించుకోవాలంటే, చాలా ఆత్మబలం అవసరం. జీవితంలోని దురదృష్టవంతులు మన ప్రక్కనే వుంటారు. మనలోనే స్నేహంగా తిరుగుతూ వుంటారు. బాధపడుతూ, గాయాలు పడుతూ మన కళ్ళ ఎదుటనే అకాల మృత్యువు వైపు నడుస్తూ వుంటారు. మనం గుర్తించం. గుర్తించినా మన ఆనందంలో నుంచి తప్పుకొని, వాళ్ళ కోసం చెయ్యి చాచం. చాచినా సహాయాన్ని తీసుకోరు. సహాయం*

*చెయ్యలేం. నిస్సహాయులం. సహాయం తీసుకోవడం వాళ్ళకీ చాత కాదు. దౌర్భాగ్యులూ, నిస్సహాయులూ, విచిత్రమైన లోకం. భయంకరమైన జీవితం.”*

ఈ వాక్యాలు చలంగారి రచనల నుండి సేకరించినవి. తనలోని నిరంతరం మండే ఆలోచనలకు అక్షర రూపం ఇచ్చి, ఆ మంటలతో పాఠకులను నిలువరించి, ఆలోచింపజేసినవాడు. తను వ్రాసిన సాహిత్యాన్నేకాదు, వ్యక్తిగత జీవితాన్ని కూడా, అత్యంత విశాలం చేసుకున్నవాడు. చలం. గుడిపాటి వెంకట చలం.

ఈ భాగంలో ఆయన రాసిన విన్నూతన సాహితీ ప్రక్రియల గురించి తెలుసుకుందాం.

వాటిల్లో మొదటిది ***ప్రేమలేఖలు***. ప్రేమలేఖలు అంటే, ప్రేమించేవాళ్ళు తమ ప్రేమని వ్యక్త పరచడానికి ఎదుటివాళ్ళకు రాసే ఉత్తరాలు. లేదా అప్పటికే ప్రేమించుకున్న వాళ్ళు, పరస్పరం రాసుకున్న ఉత్తరాలు. లేదా దూరంగా వున్న ప్రేమికులు రాసుకునే ఉత్తరాలు. ఇలా ఎన్నయినా నిర్వచనాలు చెప్పుకోవచ్చు. ఇది మనం సాధారణంగా చూసే కోణం. కానీ, ప్రేమలేఖలకి అసలైన నిర్వచనం ఏమిటి? వాటిని వ్రాయాలంటే ఎలాంటి మనస్థితి ఉండాలి? ఎలాంటి లేఖలు వాగ్మయంలో నిలుస్తాయి. ఇలాంటి అంశాలను వందేళ్ల క్రితం క్రితమే చలంగారు ఎలా చెప్పారంటే –

> *“ప్రేమలేఖ” అంటే, ప్రియమైన మిత్రులకి రాయడం. పురుషులుగానీ, స్త్రీలు గానీ ఆ జెండర్ భేదం అయినప్పుడు, ఆ ప్రేమ లాగానే, ఆ లేఖలలో కూడా రొమెన్సూ, పొయెట్రీ, టెండర్ నెస్, ఎక్కువగా కనిపిస్తాయి. లేఖలు ఎక్కువగా, అందంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. ప్రేమ లేఖలు కానివి, పోస్టులో రోజూ వెళ్లే ఉత్తరాలు అన్నీ చెత్త. చికాకు వ్యవహారాల కోసం, దొంగ మర్యాదల కోసం, తగాదాలూ, నోటీసులూ ఈ రకాలు. మొత్తానికి విసుక్కుంటూ రాసేవి. ఏడుస్తూ చదివేవిగా ఉంటాయి మిగతా ఉత్తరాలు. వాగ్మయంలో లేఖకు స్థానం ఉండాలంటే, ప్రేమలేఖ కావాలి. లేఖ ఒక కంటిన్యుయస్ థాట్ గా ఉండాలి. చాలా ప్రియమైన మిత్రులతో, చల్లని కాలవ ఒడ్డున గానీ, వెచ్చని గదిలో టీ, సిగరెట్ల ముందు గానీ, కూర్చున్నప్పుడు ఎట్లా మాట్లాడతాం అట్లా ఉండాలి వుత్తరం. అంత నేచురల్ గా చదివేవారికీ, ఆ రాసే వారిని కలుసుకొని మాట్లాడుతున్నాం అనిపించాలి. వుత్తరం చేతిలో పట్టుకొని చదివేవారు డే డ్రీమ్స్ లోకీ, కలల్లోకీ వెళ్లకపోతే ఆ వుత్తరం వచ్చి, ప్రయోజనం లేదు.*

*నిర్వ్యాజ్యమైన స్నేహం ఉంటేనే గానీ, స్వచ్ఛమైన హృదయాలు ఉంటేనే గానీ, మధురమైన లేఖలు పుట్టవు. అట్లాంటి స్నేహం వున్నా, ఉత్తరాల్లో ఆ సంబంధాన్ని వ్యక్త పరచుకునే అభిలాష గానీ, అభిరుచి గానీ, శక్తి గానీ వున్నవారు అరుదు. మిత్రుత్వం అనేది “మీన్స్ ఫర్ ఏన్ ఎండ్“ కాకుండా, “ఎండ్ ఆన్ ఇట్ సెల్ఫ్” అయినప్పుడే కవిత్వం కలుగుతుంది. ఈ దేశంలో భార్యా భర్తల మధ్య లేఖలు నడవవు. చాలా మంది భార్యలకు అసలు రాయడమే*

చాతకాదు. రాయడం చేతనైనా పోస్టేజి కోసం ఎవరినైనా యాచించాలి. భర్తతో మాట్లాడవలసినవి గానీ, అతనికి రాయవలసినవి గానీ, కొత్త సంగతులు భార్య కేమీ వుండవు. పుట్టింటికి వెళ్లినా 'పిల్లలకు జలుబుగా ఉందనీ, నన్ను అక్కడ సరిగ్గా చూడలేదనీ, గూంగూర పచ్చడి జాడి జాగ్రత్తగా చూడమని' తప్ప రాయవలసిన విషయాలేవీ గోచరించవు. తప్పిజారి ఇంకేమైనా కవిత్వం ఆమెకి రాయడం తటస్థించిందా? భార్యకి తాత్కాలికంగా మనోవైకల్యం, టెంపరరీ ఇన్సేనిటీ కలిగిందని భయపడతాడు భర్త. దినదినమూ ఒకటే సంగతులూ, ఒకటే ఆలోచనలతో మిళితమై జీర్ణమైన స్త్రీబుద్ధి, నగలమీదా, చీరలమీదా, మర్యాదల మీదా కేంద్రీకరించిన స్త్రీ మేధస్సు, ఎట్లా ప్రత్యేకమైన వేరే అయిన భావాల్ని ప్రకటించగలదు?

ఇక భార్యా భర్తలుకాని వాళ్ళు, వీళ్ళ వ్యవహారం ఉత్తరాలు రాసుకునే దాకా రానేరావు. ఏ రాత్రో గోడలు దాటి, రెండు నిముషాల తర్వాత, మళ్ళీ గోడలు దాటడంతో ఆఖరు. ఉత్తరాల అవసరం వచ్చినా, దస్కత్తులు లేని, గూడార్థాలతో మరుగున పడ్డ నాన్ కమిటల్ చీట్లతోనే మొదలూ, ఆఖరూ. ఆంధ్ర స్త్రీ అంత జాగ్రత్త స్త్రీ ప్రపంచంలో లేదు. తనేమైనా చేస్తుంది గాని, ఒక్క ముక్క కాగితం మీద నాలుగు అక్షరాలు వ్రాసి, కమిట్ కాదు. ఇంక ప్రేమలేఖలు అవకాశం ఎక్కడిది? ఒక్కర్తే వెర్రిదై రాసిందా? అందులో నవీన కవికి రాసిందా? ఆమె ఉత్తరాన్ని పట్టుకొని ప్రతివాడికీ చూపిస్తూ, ఆమెని వర్ణించుకుంటూ, తన ఆకర్షణా ప్రభావాన్నీ, కవితాశక్తినీ రూప ప్రభావాన్ని చూపుకుంటూ, వీధి వీధులా ప్రపంచం అంతా ఊరేగుతాడు ఆ కవి.

వాంగ్మయానికి పనికి వచ్చే లేఖలు అందులోనూ ప్రేమలేఖలు ఉత్పత్తి కావాలంటే, ఆ రాసుకునే వాళ్లకి పరస్పర గౌరవం, తీవ్రమైన ఆకర్షణా, తమ మనోద్రేకాలనీ, తీవ్రమైన భావాల్లోకి మార్చగల నేర్పు, రెండో వాళ్ళు తన ప్రేమలేఖల్ని అర్థం చేసుకోగలరనే నమ్మకం ఉండాలి. ఎంతయినా కానీ, విరహమే ప్రేమలేఖలకు ముఖ్యమైన కారణం. సాధారణులలో విరహం, ప్రేమకి గోరీ కడుతుంది. దేహాలు ఉపయోగించకుండా, హృదయాలతో ప్రేమ నిలుపుకోగల మనుషులు చాలా అరుదు. వియోగం ముఖ్య కారణం చేతనే ప్రేమలేఖలు సర్వ సాధారణంగా జాలిగా, దిగులుగా ఉంటాయి. కాళిదాసు ప్రేమ సందేశం ప్రేమ లేఖలు కాక ఇంకేమిటి? ఆ కవి హృదయంలో ఎంత విరహ వేదన లేనిదే కావ్యం రాసి ఉండగలడు. గట్టిగా తపన పడిన వాడూ, నరాలు చీలేట్లు వేదనతో కొట్టుకోనివాడూ, తిండికీ, డబ్బుకీ ఇంకా ఏదో ఉత్తమైనది, తనకే అర్థం కానిది ఏదో ఎండమావుల కోసం ఆశలు పడనీ వాడూ, కలలే లేని మానవుడూ, మూడు పూట్లా తిని, ఇంట్లో స్త్రీని భద్రంగా చూసుకొని, బుర్ర తడుముకుంటూ తిరిగేవాడూ, ప్రేమలేఖలు ఎలా రాస్తాడు?

ప్రియురాలు దగ్గర లేనప్పుడు ఆమెతో "ఇంటిమేట్ "గా మాట్లాడడమే ప్రేమలేఖ. ఆంతరంగిక మిత్రుడితో హృదయంలోని మార్దవమైన అభిప్రాయాలను చెప్పుకోవడమే ప్రేమలేఖ. మన ఆత్మని, వాళ్ళ ఆత్మలతో దూరాన్నీ,

*కాలాన్నీ జయించి ఐక్యం చేయడానికి చేసిన ప్రయత్నమే అన్వేషిస్తున్నానని జ్ఞాపకం చేయడమే ప్రేమలేఖ.ఈ ప్రపంచమే, ఈ సృష్టి సౌందర్యమే ఒక పెద్ద ప్రేమలేఖ. ఆ భాష తెలిసిన వాళ్లకి, ఎక్కడో ఒక్కొక్క అక్షరం అర్ధమై, తక్కిన సందేశం కోసం వెర్రి ఆశలో పడిన ఉన్మత్తులు ఇంకేం చేతకాక, కాగితాల మీద ప్రేమలేఖలు రాసి, వెలుగు నీడలకి అంకితం ఇస్తారు."*

ఈ చిట్టచివరి వాక్యం బహుశా చలంగారు తన గురించే చెప్పుకున్నారు. *"ఎవరికీ అర్ధం కాక కాగితాల మీద రాసి, వెలుగు నీడలకి అంకిత మిస్తారు."* ఎందుకంటే, ఈ ప్రేమ లేఖల్ని ఆయన అలాగే చేశారు. ఇంత చెప్పిన చలం గారు ప్రేమలేఖల్ని ఎలా వ్రాసారు అని తెలుసుకోబోయే ముందు, అసలు ఈ ప్రేమ లేఖల పుస్తక నేపథ్యం గురించి మాట్లాడుకుందాం.

చలంగారు చాలా మంది మిత్రులకి ఉత్తరాలు రాసేవారని అనుకున్నాం కదా! అలా నిజంగా ఎవరికో రాసి, పోస్ట్ చేసిన ఉత్తరాలు కావు ఈ ప్రేమ లేఖలు. కథల్లాగా, నవలల్లాగా పుస్తకరూపంలో ప్రచురించడం కోసం మాత్రమే రాసినటువంటి ఉత్తరాలు ఈ ప్రేమలేఖలు. అయితే, ఎవర్నీ ఉద్దేశించి రాయలేదు.'కాదు' అని కూడా చెప్పలేం. చలం గారు ఈ ప్రేమలేఖల్ని 1922-27 మధ్యలో రాసారు. ఆయన రాస్తున్నప్పుడే, పత్రికల్లో ఇవి ప్రచురితమవుతుండేవి. ఇవి రాస్తున్న కాలంలో చలంగారి వ్యక్తిగత జీవితం ఒక్కసారి వెనక్కి తిరిగి చూద్దాం. ఆయన 'శశిరేఖ ' నవలతో కాల్పనిక సాహిత్యంలో అడుగుపెట్టిన మరుచటి సంవత్సరమే ఈ 'ప్రేమలేఖలు' రాయడం మొదలుపెట్టారు. ఇవి రాసిన 5 ఏళ్లలో ఆయన రాజమండ్రీ, బందరూ, అనంతపురం, ఏలూరూ, గుంటూరూ ఇలా చాలా చోట్ల ఉద్యోగాలు మారుతూవున్నారు. అప్పటికి ఆయనకు నలుగురు పిల్లలు. ఇద్దరు అబ్బాయిలూ, ఇద్దరు అమ్మాయిలూ. పెద్దబ్బాయి రవికి గుండెజబ్బుతో బాధ పడుతూ ఉంటే, అతనికి వైద్యం కోసం వివిధ ప్రదేశాలకు వెళ్లి వస్తున్నారు.

చలంగారి వదిన రంగనాయకమ్మగారు డాక్టర్ కోర్సు కోసం హైదరాబాద్ లో చదువుతున్నారు. చలంగారు కథలూ, నవలలూ, నాటకాలూ వ్యాసాలూ రాస్తూనే వున్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజుల్లో ఆయన వ్రాసిన ఈ ప్రేమ లేఖలకు ఆలంబన ఎవరు? ఎవర్ని గురించి రాసారు? అంటే, దానికి స్పష్టమైన ఆధారాలు లేవు. తన జీవితంలోని చాలా విషయాలను ఏ మాత్రం భేషజం లేకుండా, చెప్పుకున్న చలంగారు ఈ ప్రేమలేఖలకు మూలం ఎవరో ఎక్కడా రాయలేదు. కొంతమంది విశ్లేషకులు "చలంగారి వదిన రంగనాయకమ్మ గారు దూరంగా వున్నారు కాబట్టి, ఆమె కోసం రాసి ఉండవచ్చు." అంటారు. అయితే ఈ ప్రేమ లేఖల్లో కొన్ని చోట్ల "ఒయ్యి హైదరాబాద్ లో చదువుతోంది " (ఒయ్యి అంటే, వదిన రంగనాయకమ్మగారు )అంటారు కాబట్టి, అలాంటి వాటిని బట్టి చూస్తే, ఆమెను దృష్టిలో పెట్టుకొని రాసి ఉండకపోవచ్చు. అలాగే రూపురేఖలు లేని ఆయన వూహ ప్రేయసి ఒకరు చిన్నప్పటినుండి వున్నారు ఊహల్లో. బహుశా ఆ ఊహా ప్రేయసిని గురించి కేవలం కల్పితంగానే ఉత్తరాలు రాసి వుంటారా? అయి ఉండవచ్చు.

ఎవరికి రాస్తేనేం? ఇలా ప్రేమలేఖలు అనే సాహిత్య ప్రక్రియను ప్రారంభించిన తొలి తెలుగు రచయిత చలంగారే. వందేళ్ల క్రిందట ఆయన రాసిన ఉత్తరాలు ఇప్పుడు చదివినా, అప్పుడే విరబూసిన మల్లె పూవులంత సువాసనల్ని వెదజల్లుతుంటాయి. అర్థం చేసుకొని, అన్వయించుకొని, ఆస్వాదించుకునే సున్నిత హృదయాలకు ఈ ప్రేమలేఖల్లోని భావుకత వెన్నెల విందు. తేనెల జల్లు. ఈ ప్రేమలేఖల్లో ఏదో ప్రేయసి అందాల్ని వర్ణించడమో, లేదా విరహాన్ని వ్యక్త పరచడమో, అనురాగాన్ని చెప్పడమే కాకుండా చలంగారు తన నిజ జీవితంలో జరిగిన సంఘటనల్ని కూడా తరచూ వీటిల్లో చెప్పారు. మరి, "ఎదురుగా వుండి మాట్లాడుతున్నట్లుగా లేఖలు ఉండాలి." అంటే, జరుగుతున్నటువంటి సన్నివేశాల్ని కూడా చెప్పాలి కదా! చలం గారు చేసింది అదే. అవి చదివితే, ఆయన ఊహా ప్రేయసే కాదు, మనం కూడా ఆయన వర్ణించిన వాతావరణంలోకి వెళ్లి, ఆయన పక్కన కూర్చొని, ఆయన చెబుతున్న కబుర్లు వింటున్నట్టుగా ఉంటుంది. మచ్చుకి చలంగారి ప్రేమ లేఖలోని కొన్ని భాగాలు చూద్దాం.

*నీ కోసం నేను వెతుకుతున్నాను. నేను ఆడుకుంటున్న బొమ్మల్లో నువ్వున్నావేమోనని వెతికాను. నేను చదువుకున్న పుస్తకాల్లో, నీ రూపం ముద్రించారేమోనని చూసాను. కవులు నీ అందాన్ని పాడారేమోనని చదివాను. నువ్వెక్కడన్నా కనపడతావేమో దేశాలు తిరిగాను. నువ్వుండ బట్టే, ఈ ప్రపంచం ఇంత సుందరమూ, హృదయాకర్షకమూనూ. కాకపోతే, ఈ కొత్త లోకానికీ, నాకూ సంబంధం ఏమిటి? లోహపు బిళ్లల్నీ ఆరాధించే ఈ ప్రజలతో నాకు సాపత్యం ఏమిటి? నీ నామామృతం కలలో విన్న గానం వలె, ప్రతి నిముషం నా చెవుల్లో ధ్వనిస్తోంది. నా వేపు నడచి వచ్చే, నీ మృదు పాద రాజము అస్తమయ మేఘాలకి యెర్రని రంగు వేస్తోంది. నన్ను వెతుకుతూ వచ్చే నీ అడుగుల చప్పుడు, నా హృదయంలో ప్రతి నిముషం ధ్వనిస్తోంది. 'నువ్వున్నావు' అనీ, నీనుంచి విడిపడ్డాననీ, నీ కోసం వెతకకుండా ఒక్క నిముషం నిలువలేననీ, వీళ్ళ లెక్క నాకు రవ్వంత లేదనీ, నువ్వు నాకు వార్తలు పంపుతున్నావనీ, ఎక్కడ దేనిని ప్రేమించినా నిన్నేననీ, వీళ్ళకేం తెలుసు?*

దీనిని ప్రత్యేకంగ ఎవరికో అంకితం చెయ్యకుండా మొట్టమొదట్లో ఏం రాశారంటే.. "ఎంకి ఎవరు అని లోకం ఎప్పుడైనా కదిపితే, వెలుగు నీడలా వైపు వేలు చూపింతు "అని నండూరి వెంకట సుబ్బారావు గారు తన ఎంకి పాటల్లో రాసారు. దాన్నే మొదట్లో చలంగారు రాసారు. బహుశా, దీన్ని ఎవరి గురించి రాశారండీ అంటే, వెలుగు నీడల వైపు వేలు చూపించేవారు చలం గారు.

మరికొన్ని భాగాలు చూద్దాం...

*"మళ్ళీ మిమ్మల్ని ఎప్పుడు చూడగలను. చాలా దూరదేశం వచ్చేసాను. వాన ఎరుగని ఈ కొండల్లో చూస్తానని ఆశలేదు. చూడకపోతేనేం, ఏం చేస్తారీ ప్రేమలేఖలు మీరు. చించి కింద పడవేసి, "దుర్గా! ఈ కాగితాల్ని ఊడ్చి అవతల పారెయ్!" అంటారా? జవాబు రాయ వద్దు అనే ఆజ్ఞకైనా జవాబు రాస్తారా?మీరు రాస్తే, ఆ ఉత్తరాల్ని*

సాధారణ కాగితాలతో కలిపి, ముద్రలు కడతారు. సంచుల్లో కడతారు. మసి వేళ్ళతో తాకుతారు. ఏదో అసాధారణ మార్గాన, మీరు నాకు రాస్తారనీ, తెలిజేస్తారనీ, విశ్వాసం. గాలిలో ఎగిరే మీ ముంగురులు సాగి దూరమవుతున్న మీ నుంచి నా హృదయాన్ని పెనవేసుకున్నాయి. స్నేహంలో దేవత్వానికి ఎత్తడానికైనా విరహంలో కాలి మసై గాలిలో కలసిపోవడాని కైనా, దేనికైనా నీ వాడినే.

మరొక చోట ఇలా రాస్తారు.

"నువ్వెళ్ళి ముందు చివరి సారి, నిన్ను ఆ గది గుమ్మం దగ్గర చూసాను. నాతో రైలు దగ్గరకే కాదు. బండి దాకా కూడా రావడం భరించలేకపోయాను. నువ్వేమో అదంతా నువ్వెళ్ళిపోతున్నందుకు అనుకున్నావు. ఇంత ఒకరికి ఒకరం దగ్గరైనా మనసులు విప్పి మాట్లాడుకున్నా , ఒకళ్ళకి ఇంకొకళ్ళం అర్ధం కాము. కానీ, అర్ధంకాక పోవడంలోనే దాని వల్లనే ఆకర్షణేమో. కట్టుకోవడానికి బట్టలన్నా లేవు. వున్న చొక్కాలు రెండూ నువ్వు తీసుకెళ్ళావు అనే సంతోషం ఒక్కటే మిగిలింది. నా చొక్కాలు నీ భుజాల్ని తాకుతున్నాయనే తలంపు నన్ను పులకరింపజేస్తుంది. నా ఒంట్లో బాగుండడం లేదు.

ఎందుకో తెలుసునా? రాత్రంతా నిన్నే... నిన్నే తలచుకుంటూ వుండడం చేత. పగలల్లా పనితో ఉండి, దూరమవుతాను కదా! రాత్రన్నా నిన్ను దగ్గరకు చేర్చుకోకుండా ఎట్లా? నేను ఒంటరిగా వున్నాను. ఏ సంతోషమూ, ప్రేమా తృప్తి లేవు. అలసిన రాత్రులు ముందు నిద్ర పట్టినా, అర్ధరాత్రి మెలకువ వస్తుంది. నిద్ర రాదు. ఊరికినే కూర్చుంటాను. కిటికీ లోంచి, తూర్పు దిక్కుకేసి చూస్తుంటాను. నక్షత్రాలు చూస్తే, దేవుడు కనబడతాడంటారు. నాకేమీ కనపడదు. ఆ శూన్యమైన అగాధాలు చూస్తే భయం వేస్తుంది. మన ప్రేమ ఈ విశాల ప్రపంచంలో ఏమైపోతుందోనని వణుకు పుడుతోంది. ఏమిటీ బాధ నాకు!? అందరూ సుఖంగా బ్రతుకుతున్నట్టున్నారు. అర్ధరాత్రి నిద్రలేని కళ్ళు నాకు ఎక్కడా కనపడవు. నాకిదేదో వ్యాధి కాదు కదా! ఈ మాటలతో ఆదుర్దా కలిగిస్తున్నానా నీకు!? నీకూ, నా ప్రాణానికీ? నా హృదయం ఎండిపోయింది, నీ ప్రేమ ఇంకి పోవడం వల్ల! మధుర మూర్తి.. నువ్వొచ్చి, మళ్ళీ నీ ప్రేమతో నింపేయ్. రైలు వెళ్లే టప్పుడు నువ్వు వెనక్కి తిరిగి వెళ్లిపోతుంటే, నేను అందరి ముందు నలిగి, నీ పాదాల కిందనే చావాలని అనిపించింది. నువ్వు ఇంకెవరినైనా ప్రేమించినా? నేను నీ సేవలోనే, జీవితమంతా గడపడమే అదృష్టం అనుకున్నాను.

నా ప్రేమ అపవిత్రమైనదీ, నీచమైనదీ. నీ ప్రేమ ఉన్నతమైనదీ, నిర్మలమైనది ఇవాళెందుకో చాలా దిగులుగా, నిరాశగా వుంది. అంతం ఏమిటి? ఈ ప్రేమ కంతా, ఆనందానికంతా అంతం. వృద్ధాప్యం, చావూ, మరణమూ ఈ జీవితం అంత మన్న సంగతి, ఈ లోకాన్ని విడిచిపోయే రోజు సంగతి తలచుకుంటే, అంత విచారం కలుగుతుంది. ఏం లాభం? ప్రేమించి, అనుభవించి, ఆనందించి అవన్నీ బూడిద అయ్యేందుకే కదా! ఎప్పుడూ అంతం లేకుండా,

*ఇట్లా అందంగా బ్రతకడానికి వీలు ఎందుకు లేదో? అట్లాంటప్పుడు నిజంగా దేవుడు లేడని తెలీడం లేదూ? ప్రేమని మధ్యలో తెంపేసేవాళ్ళు. ఒకర్ని చంపి, ఒకర్ని విడిచిపెట్టేవారు. పోనీ,ముసలితనంలో నైనా సరే! మరణం అనే ఈ చీకట్లో, జీవితాన్ని లయం చేసేవాడు. వాడు రాక్షసుడు."*

ఇంతగా మనసులోని భావాలని, మరో వ్యక్తికి తెలియజెపుతూ చలంగారు దాదాపు 280 పేజీల్లో ఈ ప్రేమ లేఖలు రాసారు. మరొక చోట, ఆయన వాతావరణాన్ని ఎలా వర్ణిస్తారో చూడండి.

*"రాత్రి 10 గంటలు. నా గుడిసెలో కూర్చున్నాను. రోజల్లా విరామం లేకుండా వాన కురిసింది. ఇంకా కురుస్తోంది. బయట కటిక చీకటి. ప్రతి నిముషం తనలోకి ప్రవహించే ఈ పట్టణపు మురికి తన నీటిని కలుపుకోవడం ఇష్టం లేక, పోట్లాడుతోంది నది. చలి. ఆ నీళ్లల్లో కూర్చుని రాస్తున్నాను నీకు. కొంచెం వైనూ,నువ్వూ ఇంకేం తక్కువ నాకు. పోనీ వైన్ వద్దులే. వేడి కాఫీ చాలు. అనేక మంది వస్తారూ, వెళతారు. అనుకోని విషయంగా నువ్వు నా దగ్గరకు రావడం అనేది ఈ రాత్రి జరగకూడదా? ఇన్ని అద్భుతాలు జరిగే లోకంలో ఇది అసంభవమా?"*

అలాగే మరొక వుత్తరంలో ఏం రాస్తారంటే...

*ఇన్ని బాధలూ, ఇంత విరహాన్నీ భరిస్తున్నా, ఎంత ఉత్తమమూ, ఎంత ధన్యమైనది నా జీవితం. ప్రేమతో పవిత్రమూ, ఫలవంతమూ అయ్యింది. ఇక ముందు ఏమైతేనేం. అటువంటి ప్రేమని అనుభవించిన తర్వాత. నిన్న సాయంత్రం నది ఒడ్డున శాంతంగా వుంది. పగలంతా కలత పెట్టి, చాకలి వాళ్ళు ఇళ్ళకి వెళ్లారు. నది చంద్రుడితో ఆటలకై సిద్ధపడుతోంది. శుక్రుడు తన కాంతి ఆశీర్వచనాలను నీటిపై వెదజల్లుతున్నాడు. ఉండి ... ఉండి ... గాలి మెల్లగా నీటిని ఒడ్డువైపు తోసి, గులక మీద చప్పుడు చేస్తోంది. నువ్వే నా ప్రక్కన ఉంటే... "*

కేవలం ఆయన తన ఊహా ప్రేయసికీ, వూహ సుందరికీ తన మనసులోని భావాలను వ్యక్త పరచడమే కాకుండా, ఆ చుట్టూ జరిగే సంఘటనలని, ఎలా చెప్పారు అనేదానికి ఒక ఉదాహరణ..

*"పిల్లలూ, వాళ్ళూ వచ్చిన దగ్గరనుండి సంసార తాపత్రయం మొదలు పెట్టింది. బజారూ, కూరలూ, చిమ్నీలూ, నౌకర్లూ ఇదంతా నాకు విసుగు. నేనెందుకు ఈ సేవకత్వం చేయాలనే తిరుగుబాటు. అసలు సంసారాలు ఇట్లా ఎందుకు ఏర్పడాలి? ఈ వస్తువులన్నీ ఎందుకు అవసరం రావాలి? ఇదో రొటీన్, చీదర, ఇది ఏమాత్రం ఆరోగ్యవంతం కాదు ఎవరికీ. ముఖ్యంగా నాకు ఆనందమూ లేదు. బుద్ధీ లేదు. పొద్దున్నే లేచి, నది నీళ్లలో ఈతలు కొట్టి, ఇసక మీద ఆడుకుంటూ, విహరిస్తూ, చెట్ల నీడల కింద బ్రతకకూడదా? ఈ మనుషులు. "*

ఇవి ఆయన 1923–24 ప్రాంతాలలో రాసినవి. బహుశా ఇలాగే నీళ్లలో ఈతలు కొట్టి, ఆడుకుంటూ, విహరిస్తూ "మైదానం"లోని ఆ పాత్రలను సృష్టించారు అనుకోవచ్చు. వాటి ఆలోచనలకు పునాది ఈ ప్రేమలేఖలు రాసిన కాలం లోనే పడి ఉండాలి. ఇంకొక విషయం ఏమిటంటే, ఈ ప్రేమలేఖల్లో ఎవరైనా వ్యక్తుల ప్రస్తావన వచ్చినపుడు వాళ్ళ

పేర్లలో మొదటి అక్షరం మాత్రమే వాడారు. ఆ తరువాత చాలా సంవత్సరాలకి , ఆయనే డిక్టేట్ చేసిన ఆత్మకథ వచ్చింది. అది వచ్చినంత వరకూ ఈ ఒక్క అక్షరం వచ్చిన పేర్లుగల వాళ్ళు ఎవరో పోల్చుకోవడం అసాధ్యంగా ఉండేవి. ఈ టాక్ షో కథలు చదువుతున్న పాఠకులు, ఈ ఒక్క అక్షరం వచ్చిన వాళ్ళు ఎవరో మీలో చాలా మంది పోల్చుకోగలరు. ఉదారణనకు “ర...మ్మ’ వచ్చింది.“ అంటారు. అంటే, ‘రత్నమ్మ’ అని. అలాగే ‘రా.. ’ చనిపోయాడు” అంటారు. అంటే, ‘రాం మూర్తి’అని. అలాగే “ర.. కి ఆరోగ్యం బాగుండలేదు.. అక్కడక్కకి తీసుకువెళుతున్నారు. “అంటే, రవి. ఇలాగ వ్యక్తుల పేర్లు వచ్చేటప్పుడు మాత్రం ఆయన గుంభనంగా ఉంచేశారు. మొత్తం మీద ఈ ప్రేమ లేఖలు చదివితే, ఆయన హృదయం అర్ధమవుతుంది. ముందుగా చెప్పినట్లుగానే, భావుకత వున్నవారికి ఈ ప్రేమలేఖలు ఒక వెన్నెల విందు.

తరువాత పుస్తకం **మ్యూజింగ్స్**

తెలుగు సాహిత్యంలో ఇలాంటి సాహిత్య ప్రక్రియకు నాంది పలికింది చలం గారే. ‘మ్యూజింగ్స్’ అంటే, వ్యాసాలూ, లేఖలో, కథలూ గల్పికలూ ఇవేమీ కాదు. రచయిత తను కలం పట్టుకున్న సమయంలో మనసులో ఏ ఆలోచన వస్తే, వాటికి అక్షర రూపం కల్పించడమే ‘మ్యూజింగ్స్’ . అంటే, ఇది ఒక రకంగా ‘అంతరంగ తరంగాలు’ అనుకోవచ్చు. మనసులోకి వచ్చే భావాలు అంటే... వాటిల్లో అన్ని రకాలైన భావోద్వేగాలూ ఉంటాయి. సంతోషం, విషాదం, ఆనందం, కోపం, చిరాకూ, ప్రశాంతత ఏదైనా కావచ్చు. మనసులోని అంశాలు ఏవైనా కావచ్చు. మిత్రులూ, ఎదురుగా కనిపించే దృశ్యాలూ, గత జ్ఞ్యాపకాలూ, భవిష్యత్తును గురించిన ఆలోచనలు.. ఇలా...! చలంగారి ‘మ్యూజింగ్స్’లో ఇవన్నీ వున్నాయి.

వ్రాసింది చలంగారు కాబట్టి, ఆయన స్పృశించిన అంశాలన్నీ కలిపి ఈ మ్యూజింగ్స్ కు తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించాయి. ‘గొర్రెపాటి వెంకట సుబ్బయ్య ‘గారి మాటల్లో చెప్పాలంటే,

*“స్త్రీ జీవితంలో కలిగిన ఆవేశాలూ, ఆవేదనలూ, అనుభూతులూ, ఆనందాలూ, ఆలోచనలూ, అందంగా అందించారు చలంగారు. మరో విధంగా చెప్పాల్సివస్తే, మానవునిలోని ప్రతి నిముషమూ పొందుతున్న అనుభవం, నాకు అతని మనస్సు విశిష్టమైన ధ్వనులను ఇస్తూ ఉంటుంది. ఈ అనంతములైన ధ్వనులే ‘మ్యూజింగ్స్’ ఆయన మనస్తంత్రిక మ్రోగించిన రీతిగా గాన మొనర్చినవి. స్వీయ జీవితావస్థలను, ఒక్కొక్క చోట ప్రభల తీవ్ర వేగంతో పఠితులకు అందించును. మరొకప్పుడు కనీ వినీ ఎరగని అందాలను చూపించును. “*

ఇదీ – మ్యూజింగ్స్ లో ఏం వుంటుందీ అనే దాని గురించి ఒక స్థూలమైన పరిచయం.

ఈ మ్యూజింగ్స్ యొక్క రచనా నేపథ్యం గురించి...

చలం గారు వీటిని ప్రారంభించిన సంవత్సరం 1937. అంటే ఆయన మొట్టమొదటిసారిగా రమణ మహర్షిని సందర్శించిన మరుచటి సంవత్సరం. ఈ మ్యూజింగ్స్ రాయడం ప్రారంభించినపుడు మిత్రుడు చింతా దీక్షితులు గారికి ఒక వుత్తరం రాసారు. "మ్యూజింగ్స్ అనే కొత్త రకం సీరీస్ రాస్తున్నాను. ఈ పదాని సాహిత్యంలో తెలుగు మాట ఏమిటి?"అని. ఆయన రాసిన మొట్టమొదటి 'మ్యూజింగ్స్ ' 1937 ఆగస్టు 'వీణ' అనే పత్రికలో వచ్చింది. దాని సంపాదకుడు పాటిబండ్ల మాధవశర్మగారు. మొట్టమొదటసారి దీన్ని ప్రచురించినపుడు పాద సూచిక అంటే ఫుట్ నోట్ లాగ ఏం రాసారంటే… "మ్యూజింగ్స్ అంటే యేవో ఆలోచనలు వచ్చి, తనలో తాను గొణుక్కోవడమన్న మాట. దీనికి సరైన మాట దొరక్క చలం గారు ఇంగ్లీష్ మాటనే ఉపయోగించారు. "అని.

ఆ విధంగా 1937 లో ప్రారంభించి, చలంగారు అరుణా చలం వెళ్ళాక కూడా అంటే, దాదాపు 1955 వరకూ ఈ మ్యూజింగ్స్ రచన కొనసాగించారు. ఇవన్నీ కలసి 625 పేజీల పుస్తకంగా అభ్యమవుతున్నది. వీటిని మొట్ట మొదటగా ప్రచురించినది "వీణ"పత్రికలో అయినప్పటికీ, ఆ తరువాత కాలంలో చాలా పత్రికలు ప్రచురించాయి. 1943 వరకు ఆయన రాసిన మ్యూజింగ్స్ ని అంటే 6 సంవత్సరాలు వాటిని రెండు భాగాలుగా బందరులో కొందరు మిత్రులు, కేవలం చలం గారి మిత్రులు ప్రారంభించిన "అభిసారిక గ్రంథ మండలి"ద్వారా రెండు భాగాలుగా పుస్తకరూపంలో వచ్చాయి.

ఈ పుస్తకాలు ప్రచురితమైన 1943 వ సంవత్సరానికి చలంగారి జీవితంలో లీలగారు ప్రవేశించేసారు. వారి స్నేహం చాలా ఉధృతంగా కొనసాగుతున్న రోజులు. ఆ రోజుల్లో ప్రచురితమైన ఈ మ్యూజింగ్స్ రెండు భాగాలు 'లీల' గారికి అంకితం అని రాసారు. తరువాత రోజుల్లో కొనసాగిన వర్షన్స్ లో కూడా 'లీల గారికి' అనే కొనసాగుతోంది. చలంగారి చాలా పుస్తకాల మీద పరిశోధన గ్రంథాలు వచ్చాయి. ప్రేమలేఖలూ, కథలూ, నవలలూ, నాటకాలూ, ఉత్తరాలూ ఇలా అన్నిటి గురించి వచ్చాయి. ఈ మ్యూజింగ్స్ గురించి కూడా చలం గారికి చాలా ఆత్మీయులైన 'కె. సభా అనే రచయిత, వాళ్ళ అబ్బాయి కె.ఎస్.రమణ ఈ మ్యూజింగ్స్ మీద చక్కని గ్రంథాన్ని వెలువరించారు. చలం గారి తర్వాత తెలుగు సాహిత్యంలో ఈ ప్రక్రియను చాలా మంది 'మ్యూజింగ్స్' అనే పేరు కాక పోయినా, అలాంటివి రాసారు. ప్రముఖ రచయిత్రి లత గారు కూడా 'ఊహాగానం' అనే పేరుతో ఇలాంటి మ్యూజింగ్స్ రాసారు. ఒక విధంగా చెప్పుకోవాలంటే ఈ రోజుల్లో వస్తున్నా "బ్లాగ్స్"ని కూడా ఈ మ్యూజింగ్స్ అనుకోవచ్చు. అదండీ ఈ మ్యూజింగ్స్ ని గురించిన నేపథ్యం.

ఇప్పుడు చలంగారి రాసిన మ్యూజింగ్స్ నుంచి కొన్ని భాగాలు చూద్దాం. చలంగారు టీచర్ గానూ,స్కూల్స్ ఇనస్పెక్టర్ గానూ పనిచేశారు కద.. ఆయన అలా పని చేసేటప్పుడు ఒకసారి పరీక్ష హాల్లో ఇన్విజిలేటర్ గా వున్నారు. ఎదురుగుండా కుర్రాళ్ళు పరీక్ష రాస్తున్నారు. ఇదీ దృశ్యం. దాని గురించి మ్యూజింగ్స్ లో ఏం రాశారంటే…

*"కుర్రాళ్ళు పరీక్షలకు రాస్తుంటే కావలి కూర్చున్నాను. ఈ పరీక్షలు రాసేవారికి మార్కులు వేయడం ఎక్కువ బాధా, లేక వీళ్ళు రాస్తూ ఉండగా కావలి కాయడం బాధో నిర్ణయించుకోలేకుండా వున్నాను. ఈ కావలి కాయడంలోని, ఈ అనుమానంలో నైతిక నీచత్వం స్ఫురిస్తోంది. "మీరు దొంగలూ, మీకు నీతి లేదు. నేను చాలా నీతిమంతుడ్ని . మీ దొంగతనాలు పట్టించేందుకు ఇక్కడ వున్నట్లుంది". వాళ్ళు తలెత్తి, నా వంక చూసి, మళ్ళీ తల లోనించి రాస్తూ ఉంటే, ఇక్కడ కూర్చోవడం సిగ్గేస్తుంది.* "అని ఇంకా ఏం చెబుతారంటే, ఆ ఇన్విజిలేషన్ గురించి...

*ఉండి ... ఉండి ... ఈ కావలి వృత్తిని భరించలేక, ఒక్క అరుపు అరచి ఈ విద్యనీ, ఈ పరీక్ష కాగితాలనీ, గబగబా తిట్టి బయటకు పారిపోవాలనిపిస్తోంది. ఎప్పుడో ఈ నిగ్రహశక్తి అల్పమై పోయి, బాధ అమితమై, అట్లాంటి ఉపద్రవం చేస్తానేమో! "పిచ్చి "అన్న ఒక్క మాటలో నాపేరు కొట్టేస్తారు. నా వంటి వాళ్ళూ, నా కన్నా సుకుమారమైన ఆత్మలు గలవాళ్ళూ, ఆరోగ్యవంతులూ, ఎందరు ఇలా తిరగబడి లోకానికి పిచ్చి వారయ్యారో కదా! బానిసత్వం నరాల్లో ఇంకి, లోక క్రూరత్వాన్ని చూసి,జంకి, ఏ అదృష్టవంతుడి లోనో, దేవుడిలోనో నమ్మకం లేక, నేను ఇంక ఇట్లా ఈ నిరర్ధక సేవ వృత్తిలో నిలిచి వున్నాను. "*

అలా ఆయన ఇన్విజిలేషన్ చేసేటప్పుడే, బయటకు ఒకసారి చూస్తే, ఆ స్కూలు బయట ఒక తోట వుంది. ఆ తోటలో ఒక పూల కుండీ కూడా వుంది. కానీ, దాంట్లో పూలు లేవు. ఏదో గడ్డి అంతా మేట వేసి వుంది. ఆ గడ్డి మధ్యలో ఒక చిన్న యెర్రని పువ్వు, గాలిలో ఊగుతూ, "అలసిన నా దృష్టిని ఆపి, పలకరించింది". ఒకే ఒక్క పువ్వు ఊగుతూ, దూరంగా కనిపిస్తోంది. అక్కడ చెట్టు లేదు. పువ్వు ఎక్కడినుండో వచ్చి పడింది. దాన్ని చూస్తూ చలంగారు ఊహల్లోకి వెళ్లిపోయారు. ఏవేవో ఆలోచించుకున్నారు. ఆ పువ్వు సౌకుమార్యం గురించి, దానిని చూడడం వల్ల, తనలో కలిగిన ఆలోచనలు. ఏం రాసారంటే...

*"అట్లాగే ఆ పువ్వు కేసి కలలు గంటున్నాను. ఎండ మెరుస్తోంది. యెర్రని రేకుల మీద. భూమికి ఘాటుగా తగిలితే, బయటకు వచ్చిన రక్తపు చుక్కలాగ వుంది ఆ పువ్వు. ఆ పువ్వును చూస్తే, విశ్వనాధ సత్యన్నారాయణ గారు ఏమని వర్ణించి వుంటారో? ఇట్లా ఆలోచిస్తూవుంటే, గంట కొట్టారు. గడియారం మెల్లిగా తిరిగింది. చిత్తూరు రైలు చక్రాల వలే. నా స్వేచ్ఛనందంలో పువ్వునే మరచి, నా గతినే మరచి, బయటకు పరిగెత్తాను. మంచి నీళ్లు త్రాగాను. ఏం చెయ్యను? పంగ నామాల పంది కొక్కు హెడ్ మాస్టారు మొహం చూడాలి. పోయి ఆ పేపర్లు ఇచ్చేందుకు. కానీ, ఆ పువ్వును చూడాలనిపించింది. వెంటనే వెళ్ళాను. ఆ ఎర్రని పువ్వు. తోటలోకి పరిగెత్తాను. ఆ తొట్టిలో గడ్డిలో మెరుస్తోంది. ఎవరో ఉండ చుట్టి పారేసిన ఎర్రని కాగితం కనపడ్డది. అదే నన్ను రెండు గంటల పాటు సంతోషపెట్టిన పువ్వు.!!*

ఆయన పువ్వు అని దేన్నయితే, చూసి ఆనందంలో మునిగి పోయారో, అది నిజానికి పువ్వు కాదు.ఎర్రని కాగితం...! అయితే మాత్రం ఏమిటి? అంటూ ఏం చెబుతారంటే?

*ప్రాణం చివుక్కుమన్నది. సిగ్గేసింది. ఆ కలని నేను అట్లనే వదిలి వుండకూడదూ? కాగితమే కానీ, నిజమైన పుష్పం ఇవ్వగల ఆనందాన్నంతా ఇచ్చింది కదా! దూరాన్నించి, దాన్ని అట్లాన్నే వదలి వుండకూడదు. జ్ఞానం, సత్యం, అని దేవుళ్ళాడతారు. యోగులూ, నీతిపరులూ, సౌందర్యాన్నీ, ఆనందకరమైన భ్రమనీ, చంపే జ్ఞానం ఏం లాభం?*

*ఊహలోనూ, భ్రమలోనూ కూడా ఆనందం ఉంటే, వాటిని ఆస్వాదించడంలో తప్పులేదు.వాటిని కొట్టెయ్య కూడదు.*

అని చెబుతూ, ఇంకేం రాస్తారంటే...

*"తల్లి ఎవరు?భార్య ఎవరు? అంతా మాయ" అని తత్వాలు పాడి, ఈ లోక సుఖాన్నే ధ్వంసం చెయ్యాలనే చూసే, ప్రతివాడిని కాల్చేయాలి. నిజంగా అక్కడ పువ్వు ఉంటేనేం, కాగితం ఉంటేనేం. నాకు ఆనందం ఇచ్చేటప్పుడు ఏదయితేనేం? అట్లా చూసుకుంటే, నిజమైన పువ్వు విషయంలో కూడా, ఆ ఎర్రదనమూ, మృదుత్వమూ నా మనసు కలిపించుకున్న భావనేలే కదా! అలాంటిది ఈ ఎర్ర కాగితాన్ని చూసుకొని నేను పువ్వు అని ఆనందించడంలో తప్పు ఏమాత్రం వుంది?"*

అలాగే మరొక చోట మ్యూజింగ్స్ లో చలం గారు వెలిబుచ్చిన భావాలు.

*"కవి తన కల్పనలో లోకాన్ని అందాలతో నింపుతాడు. అందాలు దొరక్క కుళ్లిపోయే జీవితాలకు విశ్వతేజాన్నీ , వ్యాఖ్యానం చేసి, సుందరమైన పదాలకింద మార్చి ఉద్ధరిస్తారు. పాత శతకాలలో రాసినట్లు మబ్బులవలె, నదుల వలె, చెట్ల వలె, కోవెల వలె, ప్రతిఫలాపేక్ష లేకుండా, ప్రపంచ కఠోర శబ్దాలను అణచే ప్రయత్నంలో తనకి తనమీదా, తన ఆర్ట్ మీదా వుండే అభిమానాన్ని లోకం మీద తనకు వుండే ప్రేమనీ, బాధనీ తన పాటలో సమన్వయ పరచి, సాఫల్య పడతాడు. (ఎవరు?కవి.) "ఎ ట్రూ ఆర్ట్ ఈజ్ ఆల్వేజ్ ఎ లవర్ " (ప్రేమ గురించి ఏం రాస్తారంటే), స్త్రీ మీదా పురుషుడి మీదా కలిగే భావాలనీ,ఎమోషన్స్ నీ, ఎనలైజ్ చేసి విడదీసి పరిశీలిస్తే, అంతా స్వార్ధం అనిపిస్తోంది. తన తృప్తి కోసం, సౌఖ్యం కోసమే ప్రేమనంతా చూపుతున్నాడు అనిపిస్తోంది.*

*కానీ, నీకోసం నా ప్రాణాల్ని అర్పిస్తాను. నా రక్తంతో నీ పాదాల్ని కడుగుతాను. నీ ఆనందం తప్ప, నా కింక వేరే ఆశ లేదు. అనే మాటల్లో వాస్తవం లేకపోలేదు. కళా, ప్రేమా ఇటువంటి వాటికీ, తక్కిన పనులకీ ఇక్కడే బేధం. ప్రేమ స్వార్ధం. తన ఆనందం కోసమే ప్రేమిస్తారు. కానీ, ఆ ప్రేమ వల్ల ఆ ప్రేయసి కూడా ధన్యమవుతుంది. తన ప్రేమని తన*

*హృదయంలోనే కాక, ప్రేయసి నేత్రాలలో ప్రతిబింబించే తన ప్రేమని చూసి కానీ, సంతుష్టి కాలేదు ప్రియుడు. అంతే కాదు. అట్లాంటి ప్రేమ వల్ల వాళ్ళ ఇద్దరి జీవితాలే కాకుండా, లోకమే కొత్త కల్యాణంతో వెలుగుతుంది. ఎన్ని యుగాల క్రిందో, ఋషులు చేసిన అన్వేషణ, క్రిస్టియన్ ప్రవక్తలు మతానికై ధారపోసిన రక్తపు వేడి, దిక్కుమాలి నశించిన దీనుల ఆర్తాలాపం, జీవితమంతా ధీరంగా ఎదిరించిన యోధుల పట్టుదలా, పురాతన కాలపు యత్నాలూ, కలలూ, ఆశలూ, బాధలూ, వ్యధలూ ఇవేమీ వృధాగా పోలేదనీ, ఈనాటికీ, ఏనాటికీ మనుష్య స్వభావాన్నీ, యత్నాల్నీ ప్రోత్సహిస్తూ జీవించి వున్నాయని విశ్వసిస్తే, గొప్పగా ప్రేమించుకున్న పూర్వుల అనుభవం, విరహం, ఈనాటి శృంగారాలకి మెరుగు పెట్టడం తప్పదు."*

మనిషి త్యాగాల్ని ఎలా కొలవాలి అనేటటువంటి కోణంలో ఆయన చెప్పినటువంటి భావాలు..

*"ఏ ప్రయత్నాల, త్యాగాల విలువలు కొలవాలన్నా, మనిషిలో కలిగే శాంతీ, కాంతీ, దయా ఇవే కొలతలు. ఎంత గొప్ప ఉద్యమం సాధించనీ, ఏ వ్యవస్థలు స్థాపించనీ వ్యక్తి అభివృద్ధి లేనిదే ఏదీ నిలవదు. నిలవమని పట్టి నిలిపినా ఈ శాంతినీ ఇవ్వదు. మనిషి ఏం చేసాడు అని కాదు. మనిషి ఏంగా తయారయ్యాడు?అని. అదొక్కటే విలువ.*

ఈ రెండు వాక్యాలలో ఎంత అర్థం వుందో చూడండి. మనిషి ఏం చేసాడని కాదు. మనిషి ఏంగా తయారయ్యాడు అనేది ఒక్కటే.

మ్యూజింగ్స్ లో ఇలాంటి భావాలను వ్యక్త పరుస్తూ, ఆయన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల గురించి కూడా రాసారు. చలం గారు కాకినాడలో ఉండేటప్పుడు రాం మూర్తి అనే మిత్రుడు, అతని మరదలు రత్నమ్మ ఉండేవారని గతంలో తెలుసుకున్నాం.. ఆతరువాత ఆ రాంమూర్తి ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. అతన్ని గుర్తు చేసుకుంటూ మ్యూజింగ్స్ లో ఇలా రాస్తారు

*"చావడానికి రాంమూర్తి చెప్పిన కారణాలు నాకు పూర్తిగా నచ్చలేదు. అతని బోటి వాళ్ళు బ్రతికే అవసరం అమితంగా వుంది. ఏకాకినైన నాకు ధైర్యం ఇస్తూ ఉండడానికీ, నాతో సమస్యలు ఏ పర్యవసానం లేకుండా చర్చించడానికీ, నా రొద వినడానికీ, రాంమూర్తి బ్రతికి వున్నాడని చుట్టుపక్కల నిరంకుశ భర్తలకు పక్కలో బల్లెం కావడానికీ, పారిపోయిన భార్యలకు ఆశ్రయం ఇవ్వడానికి, కాంతి నెరగని చీకటి హృదయాలకి, శృంగారపు గవాక్షాలు తెరవడానికి, శాశ్వతంగా సత్యం అనుకునే హక్కుల్లో, విలువల్లో నిద్రపోయే మొద్దుల్ని, ఊపి నిద్ర లేవదన్నడానికి, ఎంతమంది నీ వంటి వాళ్ళ అవసరం ఈ నాటికి కూడా. వున్న ఒక్కడినీ, ఉండనక్కర లేదని సులభంగా అనుకున్నావు గానీ,*

ఆ రాంమూర్తి బ్రతికి ఉండగా చలంగారి కథలు పత్రికలన్నీ తిరగొట్టడం, లేదా పత్రికలు తీసుకోవడానికి వెనకాడడం, అందరూ కూడా, పత్రికల్ని, చలం గారి కథలు తీసుకోవద్దని వాటి మీద ఒత్తిడి తీసుకురావడం, ఇవన్ని గమనించి రాంమూర్తి అంటుండే వాడట

*"ఆల్ దీజ్ నాన్సెన్స్ ఆఫ్ యువర్ బ్రెయిన్ ఈజ్ ఇంప్రూవింగ్. వాట్ ఎల్స్ కె ఇట్స్ బి ఆఫ్టాల్ ఆర్ నాట్ వైల్డ్ ఫ్రాన్సిస్ మీనింగ్ లెస్ డ్రీమ్స్ అన్ రిలైజ్డ్ హోప్స్. బ్రోకెన్ ఎక్స్పిరియన్స్. ఆర్ నాట్ దీజ్ ఎ గ్రేటెస్ట్ ఎచీవ్ మెంట్స్" అని రాసాడు ఒకప్పుడు.*

*నా కథలు గొప్ప అపశకునాలనీ చూసి ఏ పత్రికా ప్రచురించని ఆ రోజుల్లోనే రాంమూర్తి నా గురించి ఇలా అన్నాడు. ఒక పత్రికాధిపతి గారు "శ్రీ విశ్వనాధ, కవి కోకిల, కవి కొండల, మల్లాది, చిలుకూరి, ఇత్యాదుల రచనలన్నీ వచ్చాయి గానీ, తమ రచన లేనిదే తమ పత్రికకు ప్రేత కళే. కాబట్టి ఎలాగైనా ఒక పేజీ అయినా తమ రచన ఒక దానికి పంపాలని నమ్రతతో ప్రార్ధిస్తున్నాను." అని రాసారని తెలుసుకుంటే, రాంమూర్తి ఎంత సంతోషించేవాడో. లేక ఇంత మర్యాదస్తుడివీ, కీర్తి మంతుడివీ అయినావా? చచ్చిపోక మిగిలి ప్రతిష్ట పాలైనవా అని దిగులు పడేవాడేమో ? "*

ఇంకోచోట సినిమాల గురించి ఏం రాసారో చూడండి.

*"సినిమాలు అందమైన కధా, నటనా ఉంటే చాలదట. ప్రజలకి ఏదో బోధించాలట. అని అందరూ అంటున్నారు. కళలోని రసం కన్నా పెద్ద సందేశం ఏముంది ప్రజలకి. బోధనలు జీవిత పద్ధతిని సంస్కరింపజూస్తాయి. నిజమైన కళ ఆత్మనే సంస్కరిస్తుంది. కానీ, ఆ సంస్కారం కనపడదు. చూచి విలువ కట్టలేం. సినిమా నిర్మాతల ఆత్మ పరిశుద్ధమైనదా? వాళ్ళ దృష్టి కళల మీదే నిలిపారా?వాళ్ళూ, నేనూ సందేశం ఇవ్వాల్సిన పని లేదు.*

*కళానుభవం కన్నా, మానవుడికి గొప్ప విద్య లేనే లేదు. ఆధ్యాత్మికం అంటే, ప్రపంచంలోని అందానికీ, ఆనందానికీ కళ్ళు తెరవడం. పిపీలికం నుండి ఆకాశం వరకూ ఆనందం నిచ్చుకోగల శక్తి ఇవ్వడం. ప్రజల ఆకలీ, దప్పీ తీర్చే పద్ధతులు వేరు. అందం ఇవ్వడమే కళకు ఉద్దేశ్యం. కళలో పాతా, కొత్తా ముందూ వెనుకా ఇవేమీ లేవు. విషయం కాదు ప్రధానం. రసాన్ని ఇచ్చిందా కళ? ఇంకా దాని ప్రయోజనం ఏమిటి? అని అడగడం గుడ్డితనం. అంత ప్రయోజనకారి ఇంక ఉండదు. గంతలు కట్టుకొని, నువ్వు వాంఛించే ప్రయోజనకారి నెరవేర్చలేదు కనుక దానివల్ల ప్రయోజనం లేదు అనడం చాలా సంకుచితం. సంగీతం పాడితే మాటలు ఏమిటి? అని అడగడం చేసే పని కాదు. ఎంత గొప్ప మాటలకన్నా కూడా హృదయాన్ని కదిలిస్తుంది రాగం. విషయం లేకుండా అందాల్ని కల్పించగలదు. కాబట్టి, గానం, కళలో అన్నింటికీ ఉత్కృష్ట మైనది. "*

మధ్యమధ్యలో ఆయన లీలగారితో మాట్లాడుతున్నప్పుడు ఆవిడ చెప్పిన సంభాషణలూ, దానికి ఈయన బదులు చెప్పిన సంభాషణలు లాంటివి కూడా రాసారు. లీల గారు అని స్పష్టంగా చెప్పారు. ఇంకో చోట ఏం చెబుతారంటే...

*"తమ ఉద్దేశ్యాలనీ, ఫీలింగ్స్ నీ బహిరంగంగా ప్రచురించేందుకు ప్రతి వారికీ హక్కు వుంది. కానీ, అధికారం చేసి ఒప్పించేందుకు అధికారం ఎవ్వరికీ లేదు. బలవంతం, .... ఇవి తెలుసుకోలేక ఎవరికైనా భావం చెబితే... "*

అది కాదు, ఇది కరెక్ట్ అని ఎదుట వాళ్ళని ఒప్పించడానికీ, చర్చల్లోకి లాగి వాదించడానికీ, వాళ్ళ మీద దాడి చెయ్యడానికి ఈ రోజుకి కూడా అలాంటి వ్యక్తులు చాలా మంది వున్నారని చలంగారు 80 సంవత్సరాల క్రిందటే చెప్పారు. ఒక చోట చిన్న కథ కూడా చెప్పారు

*ఒంటి నిండా రోగం పట్టిన ముసలతన్ని చూసి జాలి పడి, ఒకరు తీసుకుపోయి భోజనం పెట్టి, మందిప్పించి బాగు చేశారు. కొన్ని నెలలు పట్టింది. మంచి బలం గల మనిషై పూరంబడి తిరుగుతున్నాడు. భోజనానికి మాత్రం వస్తున్నాడు. ఈదాతలకది అన్యాయంగా కనపడి "మీ జబ్బు నయం అయ్యింది కదా! ఇక వెళ్ళ రాదా?"అన్నారు. దానికి అతను "ఇది వరకు రోగాన్ని చూసి జాలిపడి డబ్బులు పారేశారు. ఇప్పుడెట్లా బ్రతకను "అన్నాడు. నేనెరిగిన జోక్ అది. ఉత్త సరదాలైన సుఖంలో బ్రతకడమే చేతనైతే, ఎన్నడో శాంతిలో స్థిర పడిపోయి ఉండును మానవ జీవితం. "వీళ్లందరినీ తన్ని పనిలో పెట్టి, సుఖపెడతాం" అంటారు కమ్యూనిస్టులు. అవును తనతోనే ఉండాలి. ఎన్నాళ్ళు పూరుకుంటుంది? టన్నులకు భయపడుతునే మానవ స్వభావం ఎన్నాళ్ళు పూరుకుంటుంది. బాంబులకీ, మిషను గన్నులకీ, ఎదురు తిరిగే మానవ ప్రోద్బలం ఎప్పుడో వస్తుంది.*

ఇంకొక వరస ఏమిటంటే, ప్రపంచంలో ఇన్ని బాధలూ, కష్టాలూ, ఇన్ని సమస్యలూ ఉన్నాయని గదా! వీటన్నిటినీ వదిలేసి మీరు ఇలాంటివి రాస్తారేమిటి? అని కవుల్ని కొంత మంది అడుగుతూ వుంటారు. దీనికి సమాధానంగా చలంగారు చెబుతారంటే..

*"లోకం క్షోభిల్లుతూ ఉంటే, లక్షలు ఆకలితో చస్తూవుంటే, ఏదో అర్ధం లేని హృదయ బాధ, ప్రణయ గాధ రాస్తావా?కవి? ఎవరికోసం ఇదంతా అంటారు కదా! మీరు ఇంత క్షోభ ప్రపంచంలో ఉంటే, కోవెల పాడుతుంది. చల్లగాలి వీస్తోంది. చిన్న పిల్ల గంతులేస్తోంది. కుక్క తోక ఆడిస్తోంది. తన బాధనీ, సంతోషాన్ని కవి పాడుతున్నాడు. తన బాధనీ, సంతోషాన్నీ గుర్తించగల వారి కోసం బాధలేని వాళ్ళందరూ కూడా ములిగితే బాధలు తప్పుతాయా?ఆకలి తీరితే మాత్రం, చావులూ, రోగాలూ, భూకంపాలూ తప్పుతాయా? పువ్వులు ఎండిపోవడం,*

*రంగులు పోవడం, ముసలితనం రావడం తప్పుతాయా? ఇక నవ్వేదెప్పుడు? కవిని పాడవద్దను. దయామయా! నీ పిల్లలూ, నీ బట్టలూ, నీ అపశ్రుతీ, కూని రాగాలూ మానేవా నువ్వు "*

చలంగారు అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ తీవ్రవాదే. అందుకే ఈ మ్యూజింగ్స్ కూడా ఆయన చెప్పేటటువంటి భావాలు సూటిగా ఒక తుపాకీ గుండు పేల్చినట్లుగా ఉంటాయి. చిట్టా చివరిగా మ్యూజింగ్స్ లోని ఓ ఫిలాసిఫికల్ థాట్ ని పరిచయం చేస్తాను

*"చావడం అంటే అర్థం. ఈ నేను అనే భావం నశించడం. అది మిగిలివుంటే, ఇక మరణమూ, పునర్జన్మలూ చాలా స్వల్పమైన మార్పులు. ఆ నేను అనేది లేకపోతే నాకూ, ఇసక రేణువులకీ భేదమే లేదు. ఈ నేను అనేది రెండు విధాల నశించవచ్చు. ఈ దేహంతో పాటు పోవచ్చు. అనేక జన్మల తర్వాత మాయం కావచ్చు. ఏదైనా ముందో, వెనకో నాశనం అవ్వడమే. అనంతమైన ఈ కాలంలో ఈ నేను అనేది, కొన్నాళ్ళు ఇట్లా నిలిచి, ఆడి, ప్రేమించి, బాధ పడి, ఇంక ఏమీ మిగలకుండా, మాయమై పోతుంది. లక్షల కొలది నేనులు రావచ్చు. పోవచ్చు. కానీ, "నా, నేను " మాత్రం ఉండదు. లోకం ఉండనీ పోనీ, నాకేం సంబంధం.*

ఈ మ్యూజింగ్స్ లో ప్రతి పేజీ కూడా ఆలోచింప జేసే వాక్యాలు కోకొల్లలుగా దొరుకుతాయి. చదువుతున్నంత సేపు కూడా మనల్ని మనం మరచిపోతాం. ఆ సంఘటనల్లోకి, ఆ సన్నివేశాల్లోకి వెళ్లడమే కాకుండా, చలం గారు చెప్పేటటువంటి మనం ఏకీభవించినా, ఏకీభవించకపోయినా మన మనసుని స్పృశించకుండా వుండవు ఈ మ్యూజింగ్స్ భావాలు.

వచ్చేనెల చివరి భాగం ...

★★★★★★★★★★

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 జూన్ 18 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS